క్లుప్తంగా

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపాలి



బొమ్మిడి హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోజ్

ఉంగుటూరు: విద్యార్థి జీవితానికి మలుపు పదవ తరగతి కీలకమని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. బుధవారం బొమ్మిడి హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సన్నద్ధంపై ప్రేరణ కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. కిచెన్ గార్డెన్‌ను, డొక్క సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాలమూరి శ్రీదేవి, ఉపాధ్యాయులు గుడే శ్రీనివాసరావు, దుర్గ లక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

నూరుశాతం అక్షరాస్యత సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వయోజన విద్య నోడల్ అధికారి

నిడమర్రు: నూరుశాతం అక్షరాస్యత సాధనకు వలంటీర్లు కృషి చేయాలని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం నిడమర్రు మండల కార్యాలయంలో ఉల్లాస్ రెండో విడత అక్షరాస్యత శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో విజయ కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ క్లస్టర్ సమన్వయకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని మెరుగుపర్చాలి



నీలాద్రిపురం హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

ఉంగుటూరు: నీలాద్రిపురం హైస్కూల్లో బుధవారం ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, తరగతి గదులు, వంట శాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని మెరుగుపర్చాలని లేకుంటే చర్యలు తప్పవని నిర్వాహకులను ఎంపీడీవో హెచ్చరించారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు.

బీసీఎల్ఎస్ శిక్షణ కీలకం



బీసీఎల్ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

దెందులూరు: నర్సింగ్ విద్యార్థులకు బేసిక్ కార్డియో పల్మనరి లైఫ్ సపోర్ట్ (బీసీఎల్ఎస్) శిక్షణ అత్యంత కీలకమని ఇది ఐఎన్‌సీ నిర్ణయించిన శిక్షణ కార్యక్రమమని ఆశ్రం మెడికల్ కాలేజ్ డాక్టర్ రాజేష్ అన్నారు. బుధవారం దెందులూరు నర్సింగ్ కళాశాల విద్యార్థులకు కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, ఆశ్రం మెడికల్ కాలేజ్ డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో ఆరుగురు డాక్టర్లు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం మెటీరియల్ సర్టిఫికెట్లను నర్సింగ్ విద్యార్థులకు అందజేశారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



బైనేపల్లిలో రైతులకు మందులు అందిస్తున్న సర్పంచ్ తదితరులు

నిడమర్రు: పశువుల సంరక్షణకు నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకుని తమ పశువులను ఆరోగ్యవంతంగా ఉంచుకోవాలని నిడమర్రు మండలం బైనేపల్లి సర్పంచ్ వంజరను సత్యనారాయణ అన్నారు. బుధవారం గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 50 గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి, నట్టల నివారణ మందులు అందజేశారు. ఈవైద్యశిబిరాలు ఈ నెలాఖరు వరకూ కొనసాగుతాయని వైద్యాధికారి శ్రీనివాస్‌సందీప్ తెలిపారు. పశు సంవర్థక ఏడీ సాయిరమేష్ పాల్గొన్నారు.

దోమల ఉధృతి.. వ్యాధుల వ్యాప్తి

- ఫాగింగ్ ప్రక్రియ ప్రారంభించేదెన్నడో?
- పట్టించుకోని గ్రామ పంచాయతీ పాలకులు, అధికారులు
- దోమల కారణంగా ప్రజల కంటిపై కునుకు కరువు



వంగూరు పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు



పల్లపు ప్రాంతంలో నెలల తరబడి నిలిచి ఉన్న మురుగు నీరు

పెదవేగి : చలికాలం అంటేనే దోమల వృద్ధికి అనుకూలం. ఈ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ఏటా ప్రభుత్వం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఫాగింగ్ కార్యక్రమాన్ని నిర్వహించేంది. ఈ ఏడాది జనవరి నెలఖరు వచ్చినా ఈ ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. చలికాలం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకూ దెందులూరు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో ఒక్క వీధిలోనూ ఫాగింగ్ మొదలు పెట్టలేదు. కనీసం మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలను మరమ్మతులు చేయించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

నేటికీ ప్రారంభం కాని ఫాగింగ్ ప్రక్రియ

దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి మండలంలో మొత్తం 30 గ్రామ పంచాయతీలు 56 రెవెన్యూ గ్రామాలుండగా, దెందులూరు మండలంలో 17 పంచాయతీలు 21 గ్రామాల్లో, పెదపాడు మండలంలో 23 పంచాయతీలు, 28 గ్రామాలు వీటిలో ఒక్క గ్రామంలోనూ నేటికీ ఫాగింగ్ ప్రక్రియ ప్రారంభించలేకపోవడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో దోమల ఉధృతి అధికమై ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. దోమల నివారణలో భాగంగా గ్రామాల్లో ఫాగింగ్ చేస్తుండగా కొన్ని పంచాయతీల్లో యంత్రాలు చెడిపోయాయి. దీంతో ఈ యంత్రాలను ఆ పంచాయతీ కార్యాలయాల్లో ఉంచారు. ప్రభుత్వం మురికిగుంతల్లో, డ్రెయినేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయటానికి మలేరియా నివారణ కిట్లు, మందులు, స్ప్రేయర్లు పంచాయతీ కార్యాలయాలకు అందజేశారు. ఇప్పటి వరకు పొలాల్లో పంటపై ఉండే దోమలు అన్ని ప్రాంతాల్లో పంటలు తీసివేయడంతో ఆ దోమలన్నీ మురికి గుంతలున్న ప్రాంతాలు, ఇంట్లోని బావులకు, ఇళ్లకు చేరుకుని ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. దీంతో దోమల తీవ్రత పెరగడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రాణాంతకమైన మలేరియా, డెంగీతో పాటు జ్వరాల వ్యాప్తి అధికంగాఉన్నా అధికారులు దోమల నివారణపై దృష్టి సారించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నేటికీ ఒక్క గ్రామంలోనూ ఫాగింగ్ చేయలేదు. అధిక శాతం గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు లేకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వివిధ గ్రామాల సర్పంచ్‌లను వివరణ కోరగా, ఫాగింగ్ యంత్రాలు సరిగా పనిచేయడం లేదని, త్వరలో ప్రారంభిస్తామని చెబుతున్నారు.

త్వరలో ఫాగింగ్ ప్రారంభిస్తాం



అన్ని గ్రామాల్లో ఉన్న కార్యదర్శులతో మాట్లాడి ఫాగింగ్ ప్రక్రియ ప్రారంభిస్తాం . కొన్ని కిట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బయట నుంచి తీసుకుని వచ్చి మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలు, చెత్తా చెదారాలపై మందు చల్లిస్తాం. వీలైనంత త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– కె శ్రీనివాస్, ఎంపీడీఓ, పెదవేగి

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని దోసపాడులో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను దెందులూరు తహసీల్దార్ బి.సుమతి తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే భోజనం నాణ్యత, సరుకులు, స్టాకు, హాజరు రికార్డులు, మంచి నీరు, విద్యుత్తు, క్రీడా ప్రాంగణం అంగన్‌వాడీలో ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు. చిన్నారులను ఆహార నాణ్యత, సౌకర్యాలపై ఆరా తీశారు.

అచ్చమ్మ తల్లి ఉత్సవాలకు డీఎస్పీకి ఆహ్వానం

దెందులూరు: కోస్తా జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాలకు రావాల్సిందిగా ఇంటిలిజెన్స్ డీఎస్పీ ఏలూరు మేకా సుధాకర్‌ను ఆలయ కమిటీ ఆహ్వానించారు. బుధవారం ఆయన నివాసంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సుధాకర్ మాట్లాడుతూ తమ కుటుంబం అచ్చమ్మ పేరంటాలు తల్లి భక్తులమన్నారు. తాము విధి నిర్వహణలో ఎక్కడ ఉన్నా క్రమం తప్పకుండా పాతికేళ్లుగా అమ్మవారి దర్శనం చేసుకుంటున్నామన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ రాజశేఖర్

దెందులూరు: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారి పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు పాలు, గుడ్డు, మంచి పౌష్టికాహారాన్ని అందించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెదపాడు ప్రాజెక్టు ఏ సీడీపీఓ రాజశేఖర్ అన్నారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సహాయ సహకార అందిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని బుధవారం దెందులూరు మండలం రామారావుగూడెం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న చిన్నారులకు ఆధార్ క్యాంప్‌ను దెందులూరు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మతో కలిసి పెదపాడు ప్రాజెక్టు ఏసీడీపీఓ రాజశేఖర్ పరిశీలించారు. అనంతరం చల్ల చింతలపూడిలోని సచివాలయం పక్కన ఉన్న కోడ్ నంబర్ 127 అంగన్‌వాడీ సెంటర్‌ను ఏసీడీపీఓ రాజశేఖర్ దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ పరిశీలించారు. చిన్నారులు పలు ప్రశ్న అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు చక్కగా సమాధానం చెప్పడంతో రాజశేఖర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో చిన్నారులను ఆకర్షించే విధంగా బొమ్మలు ఉండటం కేంద్రం కూడా చక్కగా ఉండటంతో టీచర్ సహాయకురాలను సిబ్బందిని రాజశేఖర్ అభినందించారు. అనంతరం యాదవుల పేటలోని అంగన్‌వాడీ కేంద్రం 128 సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం తిమ్మనగూడెంలోని కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత పరిశుభ్రంగా ఉంచుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుకూలంగా పనిచేసి అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది మంచి పేరు తెచ్చుకోవాలని టీచర్లకు రాజశేఖర్ సూచించారు.

కొల్లేరు వాసుల జీవనానికి విఘాతంలా ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డీల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ముంగర సంజీవ్‌కుమార్

దెందులూరు: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కొల్లేరు గట్లను కొట్టేస్తే అక్కడ దశాబ్దాలుగా జీవిస్తున్న మూడు లక్షల పైగా కొల్లేరు వాసుల జీవన విధానం , భవిష్యత్తు, భద్రతకు విఘాతం ఏర్పడుతుందని వైఎస్సార్‌సీపీ వడ్డీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొల్లేరులో దాదాపు 1.86 లక్షల మంది ఓటర్లు, 46 బెల్ట్ గ్రామాలు, 76 బెడ్ గ్రామాలు ఉన్నాయన్నారు. గతంలో 13వేల ఎకరాల జిరాయితీ భూములు కొట్టేసారని, నేటికీ పరిహారం ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కొల్లేరుని కొట్టేస్తారంటూ నెల రోజులుగా అన్ని ప్రసార సాధనాల్లో ఇదే అంశం ప్రధాన అంశంగా ఉండటం లక్షలాది మంది కొల్లేరు వాసులను తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడేలా చేస్తోందన్నారు. కొల్లేరు, రామిలేరు, తమ్మిలేరు, బుడమేరుతోపాటు 64 కాలువలున్నాయని వాటిలో ఏ ఒక్కటిలో పూడిక తీయలేదన్నారు. గతంలో కొల్లేరులో వేసవిలో సైతం 15 అడుగుల లోతులో నీరు పుష్కలంగా ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, 1999లో అప్పటి ప్రభుత్వం 120 జీవో తీసుకువచ్చి కొల్లేరును కొట్టేయడంతో నాటి నుంచి నేటి వరకు కొల్లేరు వాసుల జీవన విధానం, భవిష్యత్తు భద్రత ప్రమాదంలో పడిందన్నారు. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, భీమడోలు, కై కలూరు, ఆకివీడు మండలాల్లో కొల్లేరు జనాభా ఉన్నారని వలసల వెళ్లే పరిస్థితి నెలకొని ఉందన్నారు. ఇటీవల ఏలూరు జిల్లాలో నిర్వహించిన డీఆర్‌సీ సమావేశంలోనూ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఎవరూ కొల్లేరు గురించి మాట్లాడకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఏ సర్వే ప్రకారం కాంటూరు నిర్ధారణ చేశారని ఇది ఎవరికి ఆమోదయోగ్యమని ప్రశ్నించారు. కొల్లేరును లక్షలాది మంది ప్రజల జీవన విధానం దృష్టిలో పెట్టుకుని రీ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పల్లెం ప్రసాద్, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఘంటసాలప్రభాకర్ రావు, వైఎస్సార్‌సీపీ నేత ఘంటసాల మోషే, పార్టీ జిల్లా కార్యదర్శి దేవదాసు ప్రేమ్‌బాబు ఉన్నారు.

భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు ప్రారంభం



భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతు పనులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీని వల్ల ఈనెల 30వ తేదీ వరకు రైల్వే గేటును రైల్వే అధికారులు మూసి వేయనున్నారు. వాస్తవానికి రెండు రోజుల క్రితమే పనులు చేపట్టాల్సి ఉంది. కూలీల కొరత వల్ల ఆలస్యమైందని రైల్వే సిబ్బంది చెబుతున్నారు. దీనితో వేరే మార్గాల ద్వారా భీమడోలుకు వందలాది మంది ప్రజలు, భక్తులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు, వాహన చోదకులు గుండుగొలను, కుర్మెళ్లగూడెం, అంబర్‌పేట మీదుగా వెళ్తున్నాయి. అవగాహన లేని వాహనదారులు ఈ రైల్వే గేటు వద్దకు వచ్చి ప్రత్యామ్నాయ మార్గాల్లో అవస్థలు పడుతూ వెళ్లారు. దీనితో పాటు భీమడోలులో వారపు సంత నేపథ్యంలో పరిసర గ్రామాలకు చెందిన పాతూరు, పెదలింగంపాడు, కుర్మెళ్లగూడెం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి రోజు వరి క్షేత్రాలకు వెళ్లే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు గేటును దాటి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. గడువు కంటే ముందుగా పనులు ముగించేలా సంబంధిత రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పిల్లలందరికీ వైద్య పరీక్షలు చేయాలి



వైద్యసిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం: రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో ప్రతి ఒక్క పిల్లవాడికి వైద్య పరీక్షలు చేయాలని, ముఖ్యంగా పిల్లలకు వచ్చే సీజనల్ వ్యాధులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. బుధవారం గణపవరం పీహెచ్‌సీలో మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఆశా కార్యకర్తలకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలకు హెల్త్ చెకప్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లలకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. పుట్టుకతో లోపాలు, చిన్నతనంలో వచ్చే పౌష్టికాహార లోపాలు, వయస్సుకు తగ్గ శారీరక మానసిక పెరుగుదల లేకపోవడం, చిన్నతనంలో వచ్చే వ్యాధులు, అంగవైకల్య లక్షణాలను వైద్య సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, హెచ్‌వీ సీహెచ్ పద్మజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశుపోషణపై పెరుగుతున్న ఆసక్తి



రైతులకు పశువుల మందులు అందజేస్తున్న అధికారులు

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు పశుపోషణపై ఆసక్తి పెరుగుతుందని, పశుసంరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గణపవరం పశుసంవర్ధక శాఖ ఏడీ డీఎం నాయక్ అన్నారు. బుధవారం గణపవరం మండలం చిలకంపాడులో పశుఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ చుక్కా అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నాయక్ మాట్లాడుతూ పశుపోషణ వృత్తిగా చేసుకుంటే కుటుంబ పోషణకు దోహద పడుతుందన్నారు. పశుసంతతి వృద్ధి చేయడానికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఆవులు, గేదెలకు గర్భకోశ పరీక్షలు చేసి చూలు కట్టించడం, రైతులకు పాల ఉత్పత్తి పెంచడమే ఈవైద్య శిబిరాల లక్ష్యమన్నారు. ఈ శిబిరంలో వివిధ సమస్యలపై తీసుకువచ్చిన 98 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు నట్టల నివారణ మందు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ ఈనెల 23న సరిపల్లెలో, 24న ఎస్.కొండేపాడులో, 25న కొత్తపల్లిలో, 27న జల్లి కొమ్మరలో, 28న వాకపల్లిలో, 29న ముగ్గుళ్లలో, 30న కోమర్రులో పశువైద్యశిబిరాలు నిర్వహిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పారావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.నాగజ్యోతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత



రోగులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు

భీమడోలు: దోమల నిర్మూలన మనందరి బాధ్యత అని, దోమల పుట్టకుండా ఉండాలంటే నీటి నిల్వలు ఎక్కువ రోజులు లేకుండా చూసుకోవాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీలో బుధవారం వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గాలి, నీటి ద్వారా వచ్చే వ్యాధులు, వాటి కలిగే అనర్థాలు, వాటి నివారణ తదితర అంశాలపై రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ద్వారా అతిసారం, టైఫాయిడ్, కామెర్లు, గాలి ద్వారా కొన్ని రకాలు వ్యాధులు, జంతువులు కరవడం ద్వారా వ్యాధుల సంక్రమిస్తాయన్నారు. దోమల ద్వారా అత్యంత ప్రమాదకరమని, మన ఇంట్లో ఉండే దోమ రక్తం తాగి ప్రాణాంతక వ్యాధులకు మూలకారణమవుతుందన్నారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని, ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దోమలకు అవాసాలుగా ఉన్న డ్రమ్ములు, మూతలు, ట్యాంకులు కడిగి అరబెట్టి మూతలు పెట్టుకోవాలని, ఫ్రిజ్ వెనుక బాక్సు, ఎయిర్ కూలర్, పూలకుండీలు, రుబ్బురోలును ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో ఉచితంగా 63 రకాలు పరీక్షలు చేస్తారని, రక్త, మూత్ర పరీక్షలతో పాటు డెంగీ, మలేరియా పరీక్షలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఇందిరా, సూపర్‌వైజర్లు రామకృష్ణ, నవీన, హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, పూర్ణావతి, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తోటగూడెం- పునుకొల్లు రహదారి అభివృద్ధి

పెదపాడు : తోటగూడెం–పెదపాడు రహదారిని బుధవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. రూ.85 లక్షల వ్యయంతో ఈ రహదారిని అభివృద్ధి చేశారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం తోటగూడెంలో సీసీ రహదారి, మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు



ప్రతిభావంతులకు నగదు పురస్కారం, జ్ఞాపిక అందించిన పెద్దలు, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు

భీమడోలు: విద్య ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని భీమడోలు హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు అన్నారు. భీమడోలులోని రిటైర్డ్ టీచర్ కోరు మాస్టార్‌గా పిలువబడే దివంగత కఠారి కోరుకొండ నాగేశ్వర నరసింహామూర్తి మాస్టారు స్మారకంగా ఆయన కుమారుడు, ఎన్ఆర్ఐ కఠారి పుణ్యమూర్తి కోరు మాస్టారు స్మారక ప్రతిభా పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ఏటా పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపే విద్యార్థులకు ఈ పురస్కారం అందిస్తున్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోరు మాస్టారు స్మారక ప్రతిభా పురస్కారం ప్రదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 2023–24 టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నగదు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కోరు మాస్టారు కుమారుడు పుణ్యమూర్తి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దాతలు ఆశయం మేరకు విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. అనంతరం ప్రథమ స్థానం పొందిన షేక్ సబీహకు రూ.5వేల నగదు, ద్వితీయ స్థానం పొందిన జహన రజితకు రూ.4వేలు, తృతీయ స్థానం పొందిన నవ్యశ్రీకి రూ.3వేల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దలతు కఠారి వీరవెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆహ్మద్, అనిల్ పాల్గొన్నారు.

నేటి నుంచి నిత్య సహాయ మాత ఉత్సవాలు

దెందులూరు: పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో గురువారం నుంచి మూడు రోజులపాటు నిత్య సహాయమాత ఉత్సవాలు, ఆలయ పదవ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు స్థానిక చర్చి ఫాదర్ తంబి రుంజల అన్నారు. బుధవారం పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో ఆయన మాట్లాడుతూ గురువారం పోతునూరు సీఎస్ఐ పాస్టర్ రాయిరాల ప్రకాష్‌రావు, దెందులూరు అశోక్ నగర్ విచారణ ఫాదర్లు అమ్మన్ రాజా ఇంజేపాల్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. 24న ఫాదర్ గలెచ్చి జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఫాదర్లు జి.మోజెస్ సత్త జోసెఫ్ మిల్క్ యర్ రాజు రాజేష్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. 25న ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి పొలిమేర జయరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక దివ్య పూజా బలి, ఆధ్యాత్మిక అతిథి సందేశాన్ని అందిస్తారన్నారు. పోతునూరు ఆర్‌సీఎం చర్చి పెద్దలు సంఘస్తులు, మరియ దళ సభ్యులు యువత సమష్టి సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. సమీప మండలాల్లోని భక్తులు మహోత్సవంలో పాల్గొని దీవెనలు పొందాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీఓ కృష్ణారావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి ప్రమాదాల నివారణకు ప్రజలకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కలిగించాలని రోడ్ సేఫ్టీ వలంటీర్లకు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా కేంద్ర రవాణా, జాతీయ రహదారులు, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం ద్వారా రోడ్‌సేఫ్టీ వలంటీర్లుగా ఎంపికైన వారికి బుధవారం స్థానిక ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వలంటీర్లుగా ఎంపికైన వారు ముందుగా రహదారి భద్రతా నియమాలు తెలుసుకోవాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా ప్రజలను, వాహన చోదకులను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ప్రాంతీయ రవాణా అధికారి కృష్ణారావు, ఎంవీఐ ఎస్‌బీ శేఖర్, ఏఎంవీఐలు ఎండీ జమీర్, పి.నరేంద్రబాబు, డి.ప్రజ్ఞ, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ రావు, నెహ్రూ జిల్లా యువజన అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు వాయిదా

ఉంగుటూరు: పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో బుధవారం ఆక్రమణలు తొలగింపు కార్యక్రమాన్ని అధికారులు వాయిదా వేశారు. ముందు అనుకున్న ప్రకారం 23 వతేదీ నుంచి ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. ఈ మేరకు పలు బృందాలను సిద్ధం చేశారు. అన్ని శాఖల అధికారులను సిద్ధం చేశారు. బందోబస్తు కోసం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ, ఎస్సై, ఇద్దరూ ఓ కేసు దర్యాప్తులో భాగంగా రాజస్థాన్ వెళ్లడంతో వారు తిరిగి రావడానికి రెండు రోజుల సమయం పడుతుందని ఈవోపీఆర్డీకి తెలియజేయడంతో ఆక్రమణల తొలగింపును ఈనెల 28కి వాయిదా వేసిశారు. ఈ విషయాన్ని మండల ప్రత్యేక అధికారి పూర్ణచంద్రశేఖర్ విలేకరులకు వెల్లడించారు.